

దూసుకొచ్చిన మృత్యువు

యర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దదోర్నాల, త్రిపురాంతకంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో సోమవారం నలుగురు మృతిచెందారు. - 8లో..



బాధితులకు సత్వర న్యాయం

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు సత్వరం పరిష్కరించి న్యాయం చేస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లా షూటింగ్ బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక నేడు

సంతనూతలపాడు: జిల్లా షూటింగ్ బాల్ జూనియర్, సబ్‌జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక బుధవారం మండల పరిధిలోని పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం రత్నకుమార్, అసోసియేషన్ ప్రెసిడెంట్ కొల్లా నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనదలచిన వారు వారి ఆధార్ కార్డు, లేదా వయసు ధ్రువీకరణ పత్రం తీసుకొని హాజరుకావాలన్నారు. 17 సంవత్సరాల బాలబాలికలు 2008 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలి. 19 సంవత్సరాల బాలబాలికలు జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలి అని తెలిపారు.

దళిత విద్యార్థుల శవపేటికలతో నిరసన

● మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్

ఒంగోలు సిటీ: కొప్పోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన దళిత విద్యార్థుల శవపేటికలతో ఒంగోలు కలెక్టరేట్ వద్ద మృతుల బంధువులు సోమవారం బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకుడు నీలం నాగేందర్‌రావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దళిత విద్యార్థులు చనిపోతే అధికార యంత్రాంగం కన్నెత్తి కూడా చూడలేదన్నారు. ఎక్స్‌గ్రేషియా ప్రకటించకపోతే శవపేటికలు కదలించబోమని పోలీస్ అధికారులకు తేల్చిచెప్పారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు గంటా సుబ్బారావు, మాల న్యాయవేదిక కన్వీనర్ చేబ్రోలు సుజన్‌రాజ్, మాలమహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి, తదితరులు పాల్గొన్నారు.

108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ నిరసన



నినాదాలు చేస్తున్న 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్

ఒంగోలు సిటీ: 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సమస్యలను ఈ నెల 25వ తేదీలోపు పరిష్కరించాలని, లేకపోతే 26వ తేదీ నుంచి జరిగే సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, జిల్లా 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట యూనియన్ జిల్లా అధ్యక్షుడు దర్గా మస్తాన్‌వలి అధ్యక్షతన రిలే దీక్ష శిబిరాన్ని కాలం సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని కోరారు. ప్రతి నెలా మొదటి వారంలో జీతాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు సంస్థ మారినప్పుడల్లా కార్మికులను తొలగించడం, బెదిరించడం ఆపాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. ఈ దీక్షలకు సీఐటీయూ నాయకులు చీకటి శ్రీనివాసరావు, బంకా సుబ్బారావు, మహేష్ మద్దతు తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం నుంచి నెల్లూరు బస్టాండు మీదుగా నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు దర్గా మస్తాన్‌వలి, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి రమేష్, యూనియన్ నాయకురాలు సీహెచ్.స్వర్ణ, నాగరాజు, గంగాధర, మార్కాపురం అధ్యక్షుడు చెన్నకేశవులు, కనిగిరి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌బాష, గురవయ్య, పొదిలి డివిజన్ అధ్యక్షుడు మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ఒంగోలు టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పెన్షన్‌దారులకు రావలసిన బకాయిలు, రాయితీలు విడుదల చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల విద్రోహ దినం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరారు. సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు ప్రతి నెలా పెన్షన్ వెయ్యి నుంచి మూడు వేలు మాత్రమే పొందుతున్నారని ఇది చాలా అమానుషమని అన్నారు. వీరికి కనీస పెన్షన్ రూ.9 వేలు డీఏతో కలిపి ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీవీఆర్ సుబ్బారావు, బీవీరావు, ఎస్ సంపత్, రాఘవులు, నారాయణ, రైతు సంఘనాయకులు చుండూరి రంగారావు, సింగరాజు శ్రీనివాసరావు, ఆంజనేయులు, నరసింహారావు, నారాయణ, శ్రీరామమూర్తి, జీ నారాయణ పెన్షనర్లపై ప్రభుత్వాలు చూపిస్తున్న వివక్షను ఎండగట్టారు. ముందుగా సంఘ జిల్లా అధ్యక్షుడు జీ శేషయ్య శిబిరాన్ని ప్రారంభించారు.

సంక్షేమం.. అసౌకర్యం

వసతి గృహాల్లో సమస్యల తాండవం | నానా అవస్థలు పడుతున్న విద్యార్థులు

ఉదయం కాలకృత్యాల నుంచి రాత్రి నిద్రపోయే వరకూ సమస్యలతో విద్యార్థులు సహవాసం చేస్తున్నారు. చాలీచాలని గదుల్లో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. అధ్వానంగా మరుగుదొడ్లు, తలుపుల్లేని కిటికీలు, బీటలు వారిన గోడలు, అపరిశుభ్రమైన పరిసరాలు దర్శనమిస్తున్నాయి. సరైన మెనూ లేక విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. ఆర్వో ప్లాంట్లు పనిచేయకపోవడంతో స్వచ్ఛమైన నీరూ కరువైంది... ఇదీ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల దుస్థితి. పాలకుల మాటల్లో వినిపించే సౌకర్యాలు భూతద్దంలో వెతికినా వీటిల్లో కనిపించడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తున్నా కాస్మొటిక్ చార్జీలు చెల్లించకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాలకు అద్దెలు చెల్లించకపోవడంలో లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టు అక్షింతలు వేస్తున్నా పాలకుల్లో, అధికారుల్లో మార్పుకానరావడం లేదు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

- కనిపించని మెనూ
- డైట్ చార్జీలు విడుదల చేయని ప్రభుత్వం
- కనీసం కాస్మొటిక్ చార్జీలు లేవు
- దుప్పట్లు లేక గజ, గజలాడుతున్న విద్యార్థులు
- అద్దె చెల్లించని ప్రభుత్వం
- భవనాలు ఖాళీ చేయమంటున్న యజమానులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఒంగోలు మంగమూరు రోడ్డులోని బీసీ హాస్టల్‌లో చిన్న గదిలో ఇరుకుగా పడుకున్న విద్యార్థులు



ఒంగోలులోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహం–2లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు : 15	గిరిజన గురుకుల పాఠశాలలు : 8	కళాశాల వసతి గృహాలు : 5	
ప్రీ మెట్రిక్ 1	వసతి పొందుతున్న విద్యార్థులు : 4,888 మంది		

జిల్లాలోని వసతి గృహాలు : 175

విద్యార్థుల సంఖ్య : 17,700 మంది

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో...

పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు	ప్రీమెట్రిక్ వసతి గృహాలు
26	55

వసతి పొందుతున్న విద్యార్థులు : 7,712 మంది

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...

పోస్ట్ మెట్రిక్ (కళాశాల) వసతి గృహాలు :	15
ప్రీ మెట్రిక్ వసతి గృహాలు	45
బాలుర హాస్టళ్లు : 50	బాలికల హాస్టళ్లు : 10
వసతి పొందుతున్న విద్యార్థులు :	5,100 మంది

ఒంగోలు వన్‌టౌన్:

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల్లో విద్యార్థులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. చాలీ, చాలని ఇరుకుగదుల్లో ఎక్కువ మంది విద్యార్థులను ఉంచడంతో అవస్థలు పడుతున్నారు. ఒక్కో గదిలో 20 మంది ఉంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. చాలా చోట్ల సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే హాస్టళ్లు కొనసాగుతున్నాయి. జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో మొత్తం 81 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 26 కళాశాల వసతి గృహాలు ఉన్నాయి. వీటి పరిధిలో 7,712 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఒంగోలు నగర పరిధిలో 13 వసతి గృహాలు ఉండగా వీటిలో రెండు మాత్రమే ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. సంతపేట పరిధిలోని బాలికల వసతి గృహం నిర్మించేందుకు ప్రస్తుతం ఉన్న వసతి గృహాన్ని కూల్చి వేసి, ప్రైవేటు బిల్డింగ్‌లో వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 45 వసతి గృహాలు ఉండగా వీటిలో 3,800 మంది విద్యార్థులు ఉంటున్నారు. 15 కళాశాలల వసతి గృహాల్లో 1300 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 29 వసతి గృహాలు ఉండగా వీటిలో 15 ఆశ్రమ పాఠశాలలుగా, 8 రెసిడెన్షియల్ పాఠశాలలుగా, 1 ప్రీ మెట్రిక్ వసతి గృహంగా ఉంది. కళాశాల వసతి గృహాలు 5 ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 4,888 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

మరుగుదొడ్లు లేక అవస్థలు:

కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో, ఒకవేళ ఉన్నా మురుగు నీరు బయటకు వెళ్లకపోవడం, బాత్ రూం తలుపులు లేకపోవడం వంటి కారణాలతో వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. బహిర్భూమికి బిక్కు, బిక్కుమంటూ బయటకు వెళుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం వసతి గృహాల్లో కనీస వసతులపై దృష్టి సారించకపోవడం శోచనీయం. ఇంత వరకూ కూటమి ప్రభుత్వం డైట్ చార్జీలు విడుదల చేయకపోవడాన్ని బట్టి వీటిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అవగతమవుతుంది. ఒక్క సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోనే నెలకు రూ.50 లక్షలు చెల్లించాలి.

కాస్మొటిక్ చార్జీల ఊసెత్తని ప్రభుత్వం:

ప్రతి విద్యార్థి స్నానం చేయడానికి సబ్బు, పళ్లు తోముకోవడానికి పేస్టు, పౌడర్ వంటి అత్యవసరమైన కాస్మొటిక్ చార్జీలను విద్యార్థికి రూ.200ల చొప్పున అందించాల్సి ఉండగా ఈ ఏడాది వసతి గృహాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ మంజూరు చేయలేదు. అంతేకాదు ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న హాస్టళ్లకు సంబంధించి ఒక్క సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోనే 35 భవనాల అద్దె దాదాపు రూ.57 లక్షలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. దీంతో కొన్ని చోట్ల భవనాలు ఖాళీ చేయాలని వాటి యజమానులు ఒత్తిడి చేస్తున్నారు.

అమలుకాని మెనూ..

సంక్షేమ వసతి గృహాల్లో మెనూ అమలు కావడం లేదు. వసతి గృహాల వారీగా పాలు, పండ్లు, కూరగాయలు, చికెన్, గుడ్లు వంటి వాటిని ఎక్కడిక్కడా కొనుగోలు చేస్తుంటారు. వారంలో 3 రోజుల పాటు చికెన్ అందించాల్సి ఉండగా అసలు చికెన్ ఇవ్వడం లేదు. వారంలో 6 సార్లు గుడ్లు అందించాల్సి ఉండగా కేవలం ఒక్క రోజుతో సరిపుచ్చుతున్నారు. ప్రతి రోజూ పాలు అందించాల్సి ఉండగా పట్టించుకోవడంలేదు. దీంతో ఎదిగే వయస్సులో ఉన్న బాలురు ఆరోగ్య పరంగా నష్టపోతున్నారు. పోషకాహారం లేకపోవడంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గి తరుచూ వ్యాధులకు గురవుతున్నారు.

✦ కనిగిరి నియోజకవర్గంలో 65 శాతం హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్నింటికి సొంత భవనాలు ఉన్నా.. వాటిలో విద్యుత్, తాగు, వాడుక నీరు సక్రమంగా లేక.. విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. కొన్ని హాస్టల్స్ లో మరుగుదొడ్లకు తలుపులు లేవు. మరి కొన్ని చోట్ల



వైపాలెంలోని బీసీ హాస్టల్‌లో చీపురుతో గదిని శుభ్రం చేస్తున్న విద్యార్థి

విద్యార్థులు ఆరు బయట బోర్ల వద్ద స్నానాలు చేస్తున్నారు. రేకుల గదుల్లో చాలీ చాలనీ ఇరుకు గదుల్లో పడుకుంటున్నారు. స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం–2లో 45 మందికి ముగ్గురు పిల్లలే హాస్టల్లో ఉన్నారు. పామూరు పట్టంలోని ఎస్సీ బాలుర హాస్టల్స్ సుమారు 30 రోల్ ఉండగా.. ఒక్క విద్యార్థి మాత్రమే కనిపించారు. కనిగిరి పట్టణంలోని కాలేజీ బాయ్స్ హాస్టల్స్‌లో సుమారు 40 రోల్ ఉండగా, విజిట్ సమయంలో పట్టుమని పది మంది కూడా లేరు. చిల్లకంపల మధ్య మరింత దయనీయంగా ఉంది. మురికి నీరు పోయే పరిస్థితి లేదు. రేకుల గదుల్లో కిటికీలకు తలుపులు లేక, ఫ్యాన్లు తిరగక.. రాత్రి పూట ప్రాంగణంలోకి పాములు తిరుగుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు బహిర్భూమికి వెళ్తున్నారు. కొత్తపేటలో బీసీ కాలేజీ హాస్టల్స్‌లో 90 మంది వరకు రోల్ ఉన్నట్లు చూపుతున్నా.. క్షేత్ర స్థాయిలో 30 మంది కూడా లేరు. రేకుల గదులు కావడంతో విద్యార్థులు పడే అవస్థలు వర్ణనాతీతం. గదులన్నీ కారుతుండటంతో విద్యార్థులు వర్షం పడితే భయాందోళనతో బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. బీసీ కాలేజీ బాలికల హాస్టల్‌లో చాలీచాలనీ ఇరుకు రేకుల గదుల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు.

✦ గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేటలోని బీసీ హాస్టల్‌లో వంటమాస్టర్ లేకపోవడంతో వాచ్‌మెన్, అటెండర్‌లు వంట చేస్తున్నారు. సాయంత్రం, రాత్రికి ఇచ్చే స్నాక్స్ ఇవ్వడంలేదు. బాత్‌రూమ్‌లు 80 మంది విద్యార్థులకు నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి. బేస్తవారిపేట ఎస్సీ హాస్టల్‌లో బాత్‌రూమ్‌లు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆరుబయట స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కంభం బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్లకు తలుపులు లేవు. భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొమరోలులోని నాలుగు ప్రభుత్వ హాస్టల్స్ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అర్లినగరంలోని బీసీ హాస్టల్ శిథిలావస్థకు చేరిన మట్టి మిద్దెలో నిర్వహిస్తున్నారు. రాచర్ల మండలంలోని యడవల్లి, అనుమలవీడు హాస్టల్స్‌లో మరుగుదొడ్లకు తలుపులు సక్రమంగా లేవు. అనుమలవీడులోని రెండు హాస్టల్స్ శిథిలావస్థకు చేరాయి.

✦ మార్కాపురం నియోజకవర్గంలోని మార్కాపురం పట్టణం చెన్నకేశవ నగర్‌లో ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో మొత్తం 66 మంది విద్యార్థులకు గాను మూడు అటాచ్డ్ బాత్ రూములు, ఒక ఓపెన్ క్లీనింగ్ వసతి మాత్రమే ఉంది. మార్కాపురం మండలం రాయవరం గురుకుల పాఠశాలలో ఆర్ఓ ప్లాంటు మరమ్మతులకు గురైంది. గజ్జలకొండ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో బిక్కు బిక్కుమంటూ చదువుకుంటున్నారు. మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో కూడా తాగునీటి సమస్య ఏర్పడింది. తర్లుపాడులో బీసీ హాస్టల్‌కు సొంత భవనం లేక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. నాడు–నేడు 2 లో భాగంగా నిర్మించ తలపెట్టిన నూతన భవన నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం నిధుల నిలిపివేయడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కొనకనమిట్ల మండలంలో గొట్లగట్టు, కొనకనమిట్ల గ్రామాల్లోని వసతి గృహాల్లో సరిపడా మరుగుదొడ్లు, నీటి వసతి లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

✦ సంతనూతలపాడు నియోజకవర్గంలో సంక్షేమ హాస్టళ్లు చాలా వరకు శిథిలావస్థలో ఉన్నాయి. పైనుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. చీమకుర్తిలోని ఎస్సీ బాలుర హాస్టల్, ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల, గిరిజన బాలుర హాస్టల్, బీసీ బాలుర హాస్టల్‌లో కూడా సరైన సురక్షితమైన మంచినీటి సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాగులుప్పలపాడు మండలంలో పోతవరం గ్రామ బీసీ సంక్షేమ వసతి గృహంలో బాలుర గదుల్లో కనీసం ఫ్యాన్లు కూడా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమ్మనబ్రోలు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు మరుగుదొడ్లు లేవు. నిడమానూరు గ్రామ వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపులు దెబ్బతిన్నాయి. మద్దిపాడు మండలంలో బీసీ హాస్టల్లో మరుగుదొడ్లకు ఉన్న రేకులు చాలా వరకు చిరిగిపోయాయి. అదే క్రమంలో హాస్టల్లో నిద్రించే సమయంలో పైన పెచ్చులూడి పడుతున్నాయి.



కనిగిరి ఎస్టీ హాస్టల్‌లో పగిలిన తలుపులు

✦ కొండపి నియోజకవర్గంలో సింగరాయకొండ మండలంలో బీసీ బాలుర వసతి గృహం రేకుల గదుల్లో ఉండటంతో ఎండాకాలం ఎండ తీవ్రతకు, చలికాలం చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లకు తలుపులు లేవు. బీసీ కాలేజీ బాలుర వసతి గృహంలో వాటర్‌ప్లాంటు మరమ్మతులకు గురైంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. తలుపులు కూడా లేవు. జరుగుమల్లి ఎస్సీ బాలికల వసతి గృహంలో వాటర్‌ప్లాంటు మరమ్మతులకు గురైంది. కొండపిలో ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలు మూతపడ్డాయి. బీసీ బాలుర వసతి గృహంలో కొన్ని గదులను ఈ ఏడాది కాలేజీ విద్యార్థులకు కేటాయించారు. మర్రిపూడి మండలంలోని కాకర్ల గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహం ఉంది. హాస్టల్ గదుల కిటికీలు, తలుపులు సక్రమంగా లేక దోమల బెడద ఎక్కువగా ఉంది. టంగుటూరు బీసీ బాలికల గురుకుల పాఠశాల వసతి గృహంలో సరిపడినన్ని మరుగుదొడ్లు, స్నానాల గదులు లేవు. పొన్నలూరు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కేవలం 6 విద్యార్థులే చేరడంతో వసతి గృహాన్ని మూసివేశారు.



కొండపిలోని బీసీ బాలుర వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న కుళాయిలు

త్వరలో కాస్మొటిక్, డైట్ చార్జీలు

సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి ఐదు నెలలకు సంబంధించిన కాస్మొటిక్ చార్జీలు, డైట్ చార్జీలు విడుదలచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వసతి గృహాలకు సరుకులు, బియ్యం ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. మిగిలిన చిన్న, చిన్న పాలు, కూరగాయలు, వంటివి స్థానికంగా కొనుగోలు చేస్తారు. బయోమెట్రిక్ పద్ధతి ద్వారా విద్యార్థుల హాజరు ఉంటుంది.

– లక్ష్మానాయక్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ



అధ్వానంగా ఉన్న దర్శి ఎస్సీ పాఠశాల బాత్‌రూములు

దర్శి నియోజకవర్గంలో లంకోజనపల్లి రోడ్డులోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో ప్రభుత్వ భవనం పెచ్చులూడి పోతోంది. అక్కడే ఉన్న ఎస్సీ హాస్టల్‌లో దుస్థితి మరింత దయనీయంగా ఉంది. బాలికలు, బాలుర హాస్టల్‌లకు ఒకే వంట మాస్టర్ ఉన్నారు. వాచ్‌మెన్‌లు, ఇతర సిబ్బంది లేరు. కురిచేడు బీసీ హాస్టల్‌కు ప్రహరీ లేదు. టాయిలెట్‌లకు రన్నింగ్ వాటర్‌లేదు. బాత్‌రూం లకు డోర్‌లు లేవు. స్లాబ్‌కు పెచ్చులూడి పోతున్నాయి.



అన్నవరప్పాడు ఎస్సీ హాస్టల్‌లో కిందపడుకున్న విద్యార్థులు

చలికి గజగజలాడుతున్న విద్యార్థులు:

ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం నవంబర్ నెల గడుస్తున్నా ఇంత వరకు దుప్పట్ల ఊసెత్తడం లేదు. దీంతో వసతి గృహ విద్యార్థులు చలికి వణుకుతూనే కాలం వెళ్లదీస్తున్నారు.

సమస్యలు పునరావృతం కాకుండా చేయాలి

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో అర్జీదారులు సంతృప్తి చెందేలా చిత్తశుద్ధితో పరిష్కారం చూపాలని, ఒకే సమస్య పునరావృతం కాకుండా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గ్రీవెన్స్ హాలులో జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి సోమవారం మీకోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ అర్జీలను సకాలంలో నాణ్యమైన పరిష్కారం చేయాలన్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు ఎంతో నమ్మకంతో గ్రీవెన్స్‌కు వస్తారని ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అధికారులు పనిచేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం అయ్యే తీరును జిల్లా స్థాయి అధికారులు పరిశీలించాలన్నారు.

ఈ నెల 19వ తేదీ జిల్లా వ్యాప్తంగా వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్యం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు వరకుమార్, లోకేశ్వరరావు, సీపీవో వెంకటేశ్వర్లు, డీటీసీ సుశీల ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

– దర్శి మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన లక్ష్మయ్య గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తనకు పింఛన్ ఇవ్వాలని కోరుతూ అర్జీ అందజేశాడు. గుండె ఆపరేషన్ చేయించుకోవడంతో పాటు షుగర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నానని, ఏ పని చేయలేకపోవడంతో జీవనం కష్టంగా మారిందని, పరిశీలించి తనకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని కోరాడు.

– అర్థవీడు మండలం పాపినేనిపల్లి గ్రామానికి చెందిన వల్లపురెడ్డి శ్రీకాంత్ గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తనకు పదో తరగతి మార్కులిస్ట్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2019–20 సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించానని తెలిపాడు. అయితే మార్కులిస్ట్ ఇవ్వాలని పాఠశాల హెడ్‌మాస్టర్‌ను ఎన్నిసార్లు కలిసి అడిగినా ఇవ్వడం లేదని, డబ్బు ఇస్తే ఇస్తానని లేకుంటే ఇవ్వనని చెప్తున్నట్లు ఫిర్యాదు చేశాడు. పరిశీలించి తనకు మార్కులిస్టు ఇప్పించాలని కోరాడు.

ఆశావర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

● ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన

ఒంగోలు సిటీ: ఆశావర్కర్స్ సమస్యలపై ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆశావర్కర్స్ సమస్యలపై కలెక్టరేట్ వద్ద ఎం.బాలమ్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలపై ఒప్పందం చేసుకొని తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. ఆన్‌లైన్ వర్కుతో పనిభారం విపరీతంగా పెరిగిందన్నారు. ఆశాలకు సంబంధం లేని డ్యూటీలు చేయిస్తున్న వైద్యాధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. వేతనాలతో కూడిన సెలవులు, మెటర్నిటీ లీవ్ సౌకర్యం కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ రెగ్యులర్ పే స్కేల్ వర్తించని కార్మికులకు ప్రతి 2 సంవత్సరాలకు వేతనాలు పెంచాల్సిన ప్రభుత్వాలు 5 సంవత్సరాలు దాటినా వేతనాలు పెంపుపై దృష్టి పెట్టలేదన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా నాయకులు చీకటి శ్రీనివాసరావు, టి.మహేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన రేకుల షెడ్

పుల్లలచెరువు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన పుల్లలచెరువు మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పుల్లలచెరువుకు చెందిన కలివెశపల్లి వెంకటనారాయణ కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి వేళ తన రేకుల షెడ్‌లో విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు, బీరువాలు, ఫ్రిజ్, బంగారం ఆభరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.5 లక్షలు మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. సంఘటనా స్థలాన్ని వీఆర్వో పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా నిలువ నీడలేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

దూసుకొచ్చిన మృత్యువు



ఘటనా స్థలంలో నాగమ్మ, పల్లవి మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై



భార్య మృతితో విలపిస్తున్న దాసరి గురవయ్య

- పెద్దదోర్నాల మండలం కొత్తూరు వద్ద బైక్‌ను ఢీకొన్న లారీ
- మూడేళ్ల చిన్నారితో సహా మహిళ దుర్మరణం
- మృతులు నందిగూడేనికి చెందిన గిరిజనులు

పెద్దదోర్నాల/త్రిపురాంతకం: యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దదోర్నాల, త్రిపురాంతకం మండలాల్లో సోమవారం మృత్యు ఘంటికలు మోగాయి. రెండు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ముందు వెళ్తున్న బైక్‌ను ఓవర్ టేక్ చేయబోయిన లారీ అదే మార్గంలో వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొట్టడంతో ఓ చిన్నారి సహా మరో మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందారు.



తీవ్ర గాయాలతో వైద్యశాలలో చికిత్స పొందుతున్న దాసరి గురవయ్య(చిన్నారి పల్లవి తండ్రి)

ఈ హృదయ విదారక ఘటన పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు సమీపంలో సొరంగ నిర్మాణ ప్రాంతం వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చిలకచర్ల నందిగూడేనికి చెందిన మూడేళ్ల చిన్నారి దాసరి పల్లవితోపాటు దాసరి నాగమ్మ(36) మృత్యువాత పడగా, చిన్నారి పల్లవి తండ్రి దాసరి గురవయ్య కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. దాసరి గురవయ్య, భార్య వీరమ్మ పెద్దదోర్నాలోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో దాసరి గురవయ్య గూడెంలో ఆశా వర్కర్‌గా విధులు నిర్వహించే తన చిన్నమ్మ దాసరి నాగమ్మతోపాటు కుమార్తె పల్లవితో కలిసి బైక్‌పై దోర్నాల వెళ్తున్నాడు. కొత్తూరు వద్ద వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో నాగమ్మతోపాటు పల్లవి అక్కడికక్కడే మృతి చెందారు. ఇరువురి మృతదేహాలు లారీ టైర్ల కింద పడి ఛిద్రం కావడంతో సంఘటనా స్థలం భీతావహంగా మారింది.

మిన్నంటిన రోదనలు

లారీ టైర్ల కింద నలిగిపోయిన దాసరి నాగమ్మ మృతదేహాన్ని చూసి భర్త గురవయ్య బోరున విలపించాడు. పిల్లల ఆలనా పాలనా ఇంకెవరు చూస్తారంటూ హృదయ విదారకంగా విలపించడం అందరినీ కలచివేసింది. గురవయ్య, నాగమ్మ దంపతులకు ఓ కుమార్తెతో పాటు మరో ముగ్గురు కుమారులు ఉన్నారు.

తమ్ముడిని చూడకుండానే పరలోకాలకు..

సోమవారం ఉదయాన్నే పుట్టిన తన చిట్టి తమ్ముడిని చూడాలని ఆశగా బయలుదేరిన చిన్నారి పల్లవిని లారీ రూపంలో మృత్యువు చిదిమేసింది. తండ్రి గురవయ్య తీవ్ర గాయాలతో వైద్యశాలలో ఉండగా, కూతురు పల్లవి ఇక లేదన్న విషయాన్ని తల్లి వీరమ్మకు తెలియకుండా బంధువులు జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా ప్రమాద ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి ప్రమాదం
- ఆర్టీసీ డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి మృత్యువాత

రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించేక్రమంలో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి వద్ద సోమవారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా నకిరేకల్ మండలం కర్లకుంట గ్రామానికి చెందినవారు నర్సరావుపేట ఆర్టీసీ డిపో బస్సును అద్దెకు తీసుకుని కర్నాటకలో బంధువు కర్మకాండకు హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు కేశినేనిపల్లి వద్ద రోడ్డు పక్కన బస్సు నిలిపారు. వీరిలో గాలి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి రోడ్డుకు అవతలివైపు వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో విజయవాడ నుంచి కర్నూలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెంకటేశ్వరరావును తప్పించబోయి ఢీకొట్టింది. ఈ క్రమంలోనే బస్సు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టడంతో ఉయ్యూరుకు చెందిన బస్సు డ్రైవర్ తిరుపతిరావు మృతి చెందారు. వెంకటేశ్వరరావు కూడా తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించారు. ఇదే మార్గంలో వస్తున్న మరో రెండు మినీ లారీలు కూడా ప్రమాదానికి గురయ్యాయి. ప్రమాద సంఘటనలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.



బస్సులోనే మృతి చెందిన డ్రైవర్ తిరుపతిరావు



హైవేపై ఢీకొన్న బస్సు-టిప్పర్

బాలల బంగారు భవిష్యత్‌కు భరోసా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

నాగులుప్పలపాడు: నేటి బాలలే రేపటి పౌరులుగా చిన్నారుల భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దాల్సిన అవసరం సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. బాలల బంగారు భవిష్యత్ వైపు బంగారు బాల్యానికి శ్రీకారం వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని చదలవాడ గ్రామంలో నిర్వహించిన బాలల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ 9వ తరగతి లోపే తల్లిదండ్రులు తమ బాధ్యత తీర్చుకోవడానికి పెళ్లి చేసి పంపడమో లేక కుటుంబ పరిస్థితులు బాగోలేక, బాధ్యతలు పైన పడిన బాలికలు చదువు మానేసి పనులకు వెళ్లడమో జరుగుతోందన్నారు. అటువంటి వారిని గుర్తించి విద్యలో రాణించేలా చేయడమో, లేక చదువు అంతగా రాని విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా ఉన్నత చదువులకు పంపడం లేదా చేతి వృత్తుల నైపుణ్యానికి సిఫార్సు చేయడం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మాధురి, మండల ప్రత్యేకాధికారి డా.బేబిరాణి, ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, చదలవాడ డీడీ రవి, ఎంపీడీవో మహాలక్ష్మి, శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మైనర్ల మృతి బాధాకరం

- ఎస్పీ ఏఆర్ దామోదర్
- జీజీహెచ్‌లో బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో మైనర్లు, యువకులు మృత్యువాత పడటం బాధాకరమని ఎస్పీ ఏఆర్ దామోదర్ విచారం వ్యక్తం చేశారు. కొప్పోలు సమీపంలో ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో మృతి చెందిన రేష్మన్, వికాస్, విశాల్ కుటుంబాలను సోమవారం ఒంగోలు జీజీహెచ్ వద్ద పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మైనారిటీ తీరని పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను ఆదేశించారు. ఆయన వెంట ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ కేవీ రాఘవేంద్ర, తాలూకా సీఐ అజయ్ కుమార్, ఎస్సైలు హరిబాబు, కృష్ణపావని ఉన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందిస్తాం

ఒంగోలు సిటీ: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 62 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎక్కువగా భూ, ఆర్థిక తగాదాలు, కుటుంబ సమస్యలు, అత్తారింటి వేదింపులపై ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సీఐ శ్రీరామ్‌బాబు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, ఎస్సైలు రజియాసుల్తానా, ప్రభాకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి
- అర్జీదార్లతో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

ఒంగోలు అర్బన్: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇళ్లు లేని పేదలతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం అర్జీదారులతో కలిసి సీపీఐ నేతలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు అర్జీ అందజేశారు. ధర్నాలో సీపీఐ నేతలు మాట్లాడుతూ పేదలకు పట్టణ పరిధిలో రెండు సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కూటమి ఇచ్చిన మేరకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున పేదలకు నివేశిత స్థలాలు ఇవ్వాలన్నారు. టిడ్కో ఇళ్లు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. తొలుత మల్లయ్య లింగం భవన్ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. దీనిలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఇతర నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు, ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్‌డీ సర్దార్, అంజయ్య, ఆదినారాయణ, వెంకట్రావు, సలార్, అబ్దుల్ సత్తార్, ఖాసీం, షఫీ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు

టెన్త్ పరీక్ష ఫీజు గడువు 26 వరకు పొడిగింపు

ఒంగోలు సిటీ: మార్చి/ఏప్రిల్ 2025లో జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన రెగ్యులర్ విద్యార్థులు రూ.125 పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 26 వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ అత్తోట కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో తప్పిన విద్యార్థులు మూడు సబ్జెక్టులకు పైబడి రూ.125, ఆ లోపు అయితే రూ.110, ఒకేషనల్ వారు ఫీజుకు అదనంగా రూ.60 చెల్లించాలన్నారు. టెన్త్ పరీక్షలకు నిర్దేశిత వయసు కంటే తక్కువ ఉన్న విద్యార్థులు రూ.300 చెల్లించాలన్నారు. చెల్లించిన వారి నామినల్‌రోల్స్‌తో పాటు సంబంధిత డాక్యుమెంట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నవంబరు 26 వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగానికి సమర్పించాలన్నారు. రూ.50 ల ఫైన్‌తో డిసెంబరు 2వ తేదీ వరకు, రూ.200 లతో డిసెంబరు 9 వ తేదీ వరకు, రూ.500 తో డిసెంబరు 16 వ తేదీ వరకు అవకాశముందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా పాఠశాల లాగిన్ నుంచి పరీక్ష ఫీజులను చెల్లించాల్సి ఉందన్నారు. వయస్సు మినహాయింపు కోసం ఫీజు రూ.300 ను సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు.

సచివాలయంలో మందేస్తూ.. వైద్య సిబ్బందిపై చిందులు!




సచివాలయం వద్ద యువకుల గుంపు

మద్దిపాడు: నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనంలో మందు తాగుతున్న కొందరు యువకులు.. అదే సమయంలో అక్కడికి వచ్చిన వైద్య సిబ్బందిపై చిందులు తొక్కుతూ దురుసుగా ప్రవర్తించారు. ఈ సంఘటన మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. సోమవారం ఉదయం 9 గంటలకు డాక్టర్ శిరీష గుండ్లాపల్లిలో నిర్మాణంలో ఉన్న సచివాలయం భవనం వద్దకు 104 వాహనంలో వెళ్లారు. అంతకు ముందుగా సచివాలయ భవనం వద్ద శుభ్రం చేయించేందుకు వెళ్లిన కీర్తి.. కొందరు యువకులు మద్యం తాగుతుండటాన్ని గమనించి వారించారు. యువకులు వాగ్వాదానికి దిగుతుండగా పంచాయతీ కార్యదర్శి సూచన మేరకు ఫోటో తీశారు. అయితే ఆ ఫొటోను డిలీట్ చేయాలంటూ ఒక యువకుడు ఆమె మీదకు దూసుకెళ్లాడు. కాసేపటికి 104 వాహనంలో డాక్టర్ శిరీష రాగా.. తమ కమ్యూనిటీ హాల్‌ను సచివాలయానికి వాడుకుంటున్నారని, అందువల్ల తాము ఇక్కడ ఉంటామంటూ వాగ్వాదానికి దిగారు. కాగా విధులకు ఆటంకం కలిగించిన యువకులపై డాక్టర్ శిరీష పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్దిపాడు పోలీసులు ఫిర్యాదుపై విచారణ చేపట్టారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కనిగిరి రూరల్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కనిగిరి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి కె.భరత్ చంద్ర సోమవారం తీర్పు వెల్లడించారు. మహమ్మదాపురం హైస్కూల్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ మైలా కిషోర్ కుమార్ వెంగనకుంటకు చెందిన జిల్లెల సుబ్బారెడ్డి వద్ద రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. బాకీ నిమిత్తం సుబ్బారెడ్డికి రూ.3 లక్షల చెక్కు ఇవ్వగా అది బౌన్స్ అయింది. దీనిపై బాధితుడు కోర్టును ఆశ్రయించగా సోమవారం న్యాయమూర్తి తుది విచారణ చేపట్టారు. నిందితునికి ఏడాది జైలు శిక్ష విధించడంతో పాటు బాధితుడికి రూ.3 లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పులో వెల్లడించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింక

పొదిలి: గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన సంఘటన సోమవారం కంభాలపాడు-చినారికట్ల జంక్షన్ మధ్య చోటుచేసుకుంది. అటవీ ప్రాంతం నుంచి తప్పించుకుని వచ్చిన జింక నయారా పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. అటవీ శాఖ పెదారికట్ల బీట్ గార్డు అచ్చిరెడ్డి తదితరులు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం జింక కళేబరాన్ని ఖననం చేశారు.

పులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్



మాట్లాడుతున్న సందీప్ కృపాకర్

మార్కాపురం: నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మార్కాపురం అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గుండాల సందీప్ కృపాకర్ తెలిపారు. ఇటీవల డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. తమ సిబ్బందికి అటవీ సమీప గ్రామాల ప్రజలతోపాటు గిరిజనులు కూడా సహకరించాలని కోరారు. సిబ్బంది తప్పు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో పచ్చదనం కోసం కృషి చేస్తామన్నారు. 2016 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన సందీప్ నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై మార్కాపురం వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన విఘ్నేష్ అప్పావ్ అనంతపురం డీఎఫ్ఓగా బదిలీపై వెళ్లారు. సందీప్ గతంలో శ్రీకాకుళం, తిరుపతి ప్రాంతాల్లో అటవీశాఖాధికారిగా పనిచేశారు.